అధ్వానం.. అపరిశుభ్రం

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పేరుకుపోయిన చెత్త, నిలిచిన నీరు
- ఇబ్బందులు పడుతున్న విద్యుత్ శాఖ సిబ్బంది

అల్లిపురం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. అపరిశుభ్రత, వర్షపు నీరు నిలువ ఉండటంతో విద్యుత్ శాఖ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన తక్షణమే పరిష్కరించడానికి వీలు కావడం లేదని వాపోతున్నారు. సౌత్ జైలురోడ్డు బీఆర్ రెడ్డి జంక్షన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా నీరు నిలిచిపోయి, మొక్కలు ఏపుగా పెరిగాయి. వాటిలో విషపురుగులు ఉండే అవకాశం లేకపోలేదని, భయం భయంగా పనులు చేయాల్సి వస్తుందని విద్యుత్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కట్టిన రక్షణ గోడ శిథిలమైందని, తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ఆటోలకు రిపేర్లు చేసే దుకాణాలు ఉండటంతో



బీఆర్ రెడ్డి జంక్షన్‌లో వర్షపు నీరు, మొక్కలతో నిండి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్త పోగు పెడుతున్నారు. దీంతో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డెబ్రిస్ డంపింగ్..

అల్లిపురం మెయిన్ రోడ్డు నుంచి ఎస్ఆర్ఎంటీకి వెళ్లే చలువతోట రహదారిలో భవన నిర్మాణ కార్మికుల



చలువతోటలో డీబీ బాక్సు చుట్టూ పేరుకుపోయిన డెబ్రిస్

కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఏపీఈపీడీసీఎల్ డిస్ట్రిబ్యూషన్ బాక్స్ వద్ద స్థానికులు భవన నిర్మాణ వ్యర్థాలు పడవేయటంతో వాహనాల రాకపోకలతో పాటు విద్యుత్ ఉద్యోగులకు సమస్యలు ఎదురవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. జీవీఎంసీ శానిటరీ సిబ్బంది డెబ్రిస్ వేసిన వారిపై చర్యలు తీసుకుని, వ్యర్థాలను తొలగించాలని నివాసులు కోరుతున్నారు.

గౌడ కులస్తులకు సహాయ సహకారాలు

డాబాగార్డెన్స్: గౌడ సంఘానికి, గౌడ కులస్తులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. విశాఖ జిల్లా గౌడ సంఘం కార్యాలయంలో ఆదివారం గౌడ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, గౌడ వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎడ్యుకేషనల్ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ సంఘీయులకు తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వాసుపల్లిని గెలుపించుకుంటామన్నారు. అనంతరం విశాఖ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు మార్గాన రామారావు గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన వివాహ పరిచయ వేదికకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి



గౌడ సంఘం పిల్లలకు అవార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అధిక సంఖ్యలో గౌడ సంఘస్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కామన వెంకట సుబ్బారావు, మట్టా ఆనందరావు, గణేష్‌గౌడ్, దీవి సుందరరావు, మార్గాన చినబాబు, రేలంగి పెద బాబు, ఏవీఎస్ఎన్ మూర్తి, దీవి సత్యవతి, భవాని, ఉమశ్రీ, యేకుల మధు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ఏకాదశి పూజలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలోని ఎర్నిమాంబ ఆలయంలో ఆదివారం శ్రావణ మాస శుద్ధ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఈవో డి.వి.



ఎస్.సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ అమ్మవారికి ఉదయం నుంచి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు జరిపారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతోపాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటావార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి

జగదాంబ: వాహనచోదకులు రవాణా శాఖ కార్యాలయం జారీ చేసిన హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్‌ను మాత్రమే ఉపయోగించాలని వన్ టౌన్ ఎస్ఐ ఎస్.వి.భాస్కర్ అన్నారు. ఆదివారం పూర్ణా మార్కెట్ జంక్షన్ వద్ద వాహనచోదకులు సొంతంగా తయారు చేసుకుని ఉపయోగిస్తున్న నంబర్ ప్లేట్లను ఆయన తొలగించి, అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు అనధికారక నంబర్ ప్లేట్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ప్రతి వాహనానికి కచ్చితంగా ఆర్టీవో జారీ చేసిన నంబర్ ప్లేట్ ఉండాలని, ఈ విషయాన్ని వాహనచోదకులు గమనించాలని ఆయన కోరారు.



తొలగించిన నంబర్ ప్లేట్లతో వన్‌టౌన్ ఎస్ఐ భాస్కరరావు

1 నుంచి 'శ్రీకృష్ణ కథా సప్తాహం'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్

సీతంపేట: లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిచే సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు శ్రీకృష్ణ కథామృత సప్తాహ ప్రవచన కార్యక్రమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. లలితానగర్‌లోని పీఠం దర్బారు హాల్లో ఆదివారం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు స్వామివారు ప్రవచిస్తారని చెప్పారు. ప్రతి రోజూ ముందుగా విష్ణు సహస్ర నామ పారాయణ, శ్రీకృష్ణ పూజ జరుగుతుందన్నారు. భక్తులు ఈ మహత్తర పారాయణ. ప్రవచన కార్యక్రమంలో పాల్గొని స్వామీజీ ఆశీర్వాదం పొందాలని కోరారు. నారాయణనంద భారతీస్వామి, చంద్రశేఖర్ మాస్టారు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు ఆదేశాల మేరకు ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ రౌడీషీటర్ల దినచర్యపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. వైన్ షాపులు, బార్‌ల వద్ద తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా ఉండాలని చెప్పారు. నేరాలకు జోలికి పోకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరానికి పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

బీవీపీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

డాబాగార్డెన్స్: భారత్ వికాస్ పరిషత్(బీవీపీ) నార్త్ ఈస్ట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఆదివారం నగరంలోని రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో జరిగింది. 2023–24 ఏడాదికి అధ్యక్షుడిగా ఎస్.సోమరాజు, కార్యదర్శిగా జేసీ శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా పి.రవికుమార్‌తో ఆర్సీ జైన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్ అక్షయపాత్ర ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు యదురాజ దాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావంతో ఉన్నత లక్ష్యంతో ప్రతి సభ్యుడు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. భారత్ వికాస్ పరిషత్ దేశభక్తితో చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. భారత్ వికాస్ పరిషత్ జాతీయ స్థాయి ప్రతినిధులు రమేష్‌చంద్ జైన్, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎంవీవీ



ప్రమాణ స్వీకార వేడుకలో పాల్గొన్న బీవీపీ కార్యవర్గ సభ్యులు

సత్యనారాయణ, రాష్ట్ర ప్రతినిధి వంకాయల సన్యాసిరాజు మాట్లాడుతూ బీవీపీ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీవీపీ రాష్ట్ర సంస్కార్ ప్రముఖ్ ఎంవీ రాజశేఖర్, మహిళా శాఖ అధ్యక్షురాలు టి.సత్యశ్రీ, వివిధ శాఖల సభ్యులు పాల్గొన్నారు.

హార్బర్ స్టేషన్ సీఐగా నరసింహారావు

జగదాంబ: హార్బర్ పోలీసు స్టేషన్ సీఐగా ఇ.నరసింహారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 1998 బ్యాచ్‌కు చెందిన ఈయన ఇప్పటి వరకు గోపాలపట్నం పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేశారు. సాధారణ బదిలీలో భాగంగా నగర సీపీ డాక్టర్ త్రివిక్రమ వర్మ ఆదేశాల మేరకు హార్బర్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన నరసింహారావు మాట్లాడుతూ హార్బర్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పని చేస్తానన్నారు.



ప్రజా ఆశీర్వాద యాత్ర ప్రారంభం

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ 39వ వార్డు కార్పొరేటర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు మొహమ్మద్ సాధిక్ ఆదివారం ప్రజా ఆశీర్వాద్ పేరిట యాత్ర ప్రారంభించారు. నియోజకవర్గంలోని వార్డుల్లో ఈ యాత్ర చేపట్టనున్నట్టు సాధిక్ తెలిపారు. ముందుగా 37, 38 వార్డుల్లో కార్యక్రమాన్ని ప్రారంభించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 38వ వార్డు బుక్కా వీధిలో మహిళలతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం దిశగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. యాత్రలో కార్పొరేటర్ వెంటనొల్లు పోతుస్వామి, కండిపిల్లి నర్సింగ్, బొడ్డు అప్పారావు,



మహిళల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సాధిక్

వాసుపల్లి రాజు, రాగతి భాను, సూరాడ తాతారావు, అర్జిల్లి మసేన్, పోలవరపు చంద్రరావు, సలీం, దురాని ఖాన్, రమా, సత్యవేణి, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిరంతర కృషి

మురళీనగర్: లక్ష్యం నిర్దేశించుకోవడంతోపాటు దాన్ని చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాలని మోటివేషనల్ స్పీకర్ సునీతామూర్తి రామవరపు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో గైస్, ఐఎస్‌టీడీ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన 'విజయం వైపు పయనం' కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో రాణించాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. సాంకేతిక విద్యను అభ్యసించే వారు తప్పనిసరిగా కంపెనీలకు అవసరమైన పరిజ్ఞానాన్ని సముపార్జించాలన్నారు. ప్రణాళికా బద్ధంగా చదవడం ముఖ్యమని పేర్కొన్నారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ వోఆర్ఎం రావ్, కాలేజీ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ సునీత

సంప్రదాయాలకు ప్రతీకలు శాస్త్రీయ నృత్యాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి



భరతనాట్య నృత్య ప్రదర్శన

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- ఘనంగా భరతనాట్య కళాంజలి అకాడమీ వార్షికోత్సవం

మద్దిలపాలెం : మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు శాస్త్రీయ నృత్యాలని, వాటిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. గురజాడ కళా క్షేత్రంలో ఆదివారం భరతనాట్య కళాంజలి అకాడమీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలను మేయర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భరతనాట్యం, కూచిపూడి నృత్యాలలో చిన్నారులకు ప్రావీణ్యం కల్పించడానికి కృషి చేయాలన్నారు. విద్యతో పాటు కళల్లో కూడా రాణించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం భరతనాట్య కళాంజలి అకాడమీ విద్యార్థులు భరతనాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అకాడమీ ప్రిన్సిపాల్ సంతోషి విజయ్, విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కన్నం వెంకటరమణ, చెన్నై కళా క్షేత్రం ఆచార్యులు వసుంధర థామస్ పాల్గొన్నారు. అనంతరం కళాకారులకు మేయర్, అతిథులు బహుమతులు అందజేశారు.

'మన్ కీ బాత్' వీక్షణ



ప్రకృతి చికిత్సాలయంలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు

మహారాణిపేట: ప్రధాని నరేంద్రమోదీ 104వ మన్ కీ బాత్ ప్రసంగ కార్యక్రమాన్ని ఆదివారం మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయంలో డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పలువురు వీక్షించారు. శ్రావణ మాస విశిష్టతను పీఎం ఎంతో గొప్పగా వివరించారని డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సమష్టి కృషితో చంద్రుడిపైన చంద్రయాన్–3 లాంచింగ్ ద్వారా జాతీయ పతాకం ఎగురవేయడాన్ని మోదీ అద్భుతంగా అభివర్ణించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, ఎస్.మహేష్, క్షీరాబ్ది దుతి, బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ రూపాకుల రవికుమార్, బీజేపీ నగర ఉపాధ్యక్షురాలు టి.గిరిజ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కోలుకున్న వ్యక్తికి ఏయూటీడీలో ఆశ్రయం

అల్లిపురం: ఈ ఏడాది మార్చి 29న జరిగిన జీ–20 సదస్సు నేపథ్యంలో నగరంలో రోడ్లపై తిరుగుతున్న మతిస్థిమితం లేని వ్యక్తులను ఏయుటీడీ సిబ్బంది రెస్క్యూ చేశారు. వారిని చినవాల్తేరు మానసిక వికలాంగుల హాస్పటల్‌లో చేర్పించి చికిత్స అందజేశారు. వారిలో ఓ వ్యక్తి పూర్తిగా కోలుకున్నాడు. తన పేరు సాధిక్ అని తెలియజేశాడు. ఈ మేరకు ఆయనను ఆదివారం టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయికి హాస్పటల్ సిబ్బంది అప్పగించారు. ఆయనకు టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని పురుషుల విభాగంలో ఆశ్రయం కల్పించారు.



సాధిక్‌ను నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయికి అప్పగిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

మూర్ఛపై అప్రమత్తత అవసరం

మురళీనగర్: మూర్ఛ వ్యాధి విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని అపోలో ఆస్పత్రి న్యూరో ఫిజీషియన్, ఎపిలెప్సి నిపుణుడు డాక్టర్ పవన్‌కుమార్ రుద్రాభట్ల అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. మెదడులోని న్యూరాన్స్ మధ్య ఎలక్ట్రికల్ యాక్టివిటీ ఎక్కువగా ఉన్నప్పుడు మూర్ఛ వ్యాధి వస్తుందన్నారు. ఇది ఏ వయసులోనైనా రావచ్చని, ఈ వ్యాధి ఉన్నప్పటికీ సాధారణ జీవితాన్ని గడపవచ్చన్నారు. మందుల ద్వారా దీన్ని నివారించవచ్చని, కొంత మందికి సర్జరీ అవసరమవుతుందని పేర్కొన్నారు. కాళ్లు, చేతుల తిమ్మిర్లు, పక్షవాతం వంటి సమస్యల పరిష్కారంపై డాక్టర్ పవన్‌కుమార్ అవగాహన కల్పించారు.

174 మందికి వైద్య పరీక్షలు

డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ జి.లావణ్యల వైద్య బృందం 174 మందికి వైద్య పరీక్షలు చేశారు. సుగర్, బీపీతోపాటు నాడీ సంబంధిత వ్యాధులు, సాధారణ వ్యాధులపై పరీక్షలు చేసి వైద్య సలహాలు అందించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి లంకా వెంకట సుధాకర్ ఆధ్వర్యంలో పవన్‌కుమార్, లావణ్య, ఇతర వైద్య బృంద సభ్యులను ఘనంగా సత్కరించారు. క్లబ్ పూర్వాధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, కె.ద్వారకానాథ్, ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకృష్ణ, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కోశాధికారి జె.కూర్మారావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, కార్యవర్గ సభ్యులు వద్దాది అప్పారావు, పి.చెల్వరాజు, ఎం.ఎస్.ఆర్.మూర్తి, బి.సూర్యనారాయణ, ఆర్.నాగేశ్వరావు శిబిరం నిర్వహణకు సహకరించారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ లావణ్య

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరే రామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించారు.

కంచర్ల అచ్యుతరావుకు డాక్టరేట్‌పై హర్షం

డాబాగార్డెన్స్: ఉపకార్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావుకు బెంగళూరులో ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్షలాది మందికి అన్న, వస్త్రదానాలు, వైద్య శిబిరాలు, ఆలయాల నిర్మాణాలు చేపడుతున్నారు. ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ ద్వారా చిత్ర నిర్మాణ రంగం, కళాకారులకు సేవలందిస్తున్న కంచర్ల ప్రతిష్టాత్మక డాక్టరేట్ అందుకోవడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఉన్న కంచర్లకు డాక్టరేట్ రావడంపై సంఘం అధ్యక్షురాలు డాక్టర్ జాలాది విజయ, ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ఉపాధ్యక్షుడు ఎం.త్రినాథరావు, కార్యదర్శి కె.లోకేశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న కంచర్ల అచ్యుతరావు

తప్పిన ప్రమాదం

పీఎం పాలెం: కారుషెడ్ కూడలిలో ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో జాతీయ రహదారిపై పెద్ద ప్రమాదం తప్పింది. కొమ్మాది కూడలి నుంచి నగరం వైపునకు వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొనడంతో కారు డివైడర్ పైకి దూసుకుపోయింది. ఈ ఘటనలో కారు నుజ్జవగా అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. స్థానిక ట్రాఫిక్ ఏఎస్ఐ ఎం.సతీష్ వెంటనే స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సంఘటన స్థలం నుంచి కారును తరలించడానికి చర్యలు చేపట్టారు.



డివైడర్ పైకి దూసుకుపోయిన కారు

ఎండాడ పాఠశాలకు క్రీడా పురస్కారం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 2022–23 విద్యా సంవత్సరానికి క్రీడా ప్రతిభ పురస్కారం లభించినట్లు పాఠశాల హెచ్ఎం పరిపూర్ణ తెలిపారు. జిల్లాలో స్కూల్ గేమ్స్‌లో అత్యధికంగా రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనడం, పతకాలు సాధించడం వల్ల పాయింట్ల ఆధారంగా పురస్కారం లభించినట్లు తెలిపారు. ఈ నెల 29న నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా డీఈవో చంద్రకళ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారం నాటికి 11వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ఘనంగా ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

సీతంపేట: నటరత్న కల్చరల్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు భయ్యా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయనీ గాయకులు విజయ, రమణి, ప్రభాకర్, మంజుల తదితరులు ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని పాటలు పాడి ఆహుతులను ఉర్రూతలూగించారు.

500 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఆంధ్ర మెడికల్ కళాశాల(ఏఎంసీ) డీవీఎల్ విభాగం వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇక్కడ ఖైదీలకు చర్మ వ్యాధులపై అవగాహన కల్పించారు. 500 మంది ఖైదీలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి, వారిలో సుమారు 200 మందికి వివిధ రకాల మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ పి.గురుప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాత్, కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిశోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప పర్యవేక్షణాధికారి పి.ఎస్.రామచంద్రరావు, ఎస్.కమలాకర్, జైలు వైద్యురాలు ఈశ్వరిదేవి పాల్గొన్నారు.



ఖైదీలకు పరీక్షలు చేస్తున్న ఏఎంసీ డీవీఎల్ విభాగం వైద్య సిబ్బంది

స్వచ్ఛ విశాఖే లక్ష్యం



కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, తదితరులు

కొమ్మాది: స్వచ్ఛ విశాఖకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాగరతీర స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన పాల్గొని బీచ్ తీరం వెంబడి ఉన్న వ్యర్థాలను తొలగించారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా తీరంలో 3.5 టన్నుల వ్యర్థాలు సేకరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.